ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 11 | జూలై 2019

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

30-03-1983
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-01-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

తెలివిగలవాళ్ళు అందరూ మోక్షానికి ప్రయత్నం చేస్తారు అని భాగవతంలో చెప్పారు. అసలు మోక్షం కోసం ఎందుకు ప్రయత్నం చేయాలి? మీరు విషయాన్ని బాగా అర్థం చేసుకోండి, మోక్షం అంటే విడుదల అని అర్థం. శబ్దానికి అర్థం విడుదల. దేనిలోంచి విడుదల? చాలామంది ఏమనుకొంటున్నారు అంటే చనిపోయాక వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళటం మోక్షం అనుకొంటున్నారు. అదికాదు. ఎక్కడికో వెళ్ళిపోవటం కాదు. మీరు మరణించిన తరువాత ఎక్కడికో వెళ్తారు అని చెప్పటానికైతే నేను ఆదివారం ఇక్కడికి రానక్కరలేదు. అది మీరు పుస్తకాలలో చదువుకోవచ్చు. మీరు వైకుంఠంలోకి వెళ్తే కొంతకాలం విష్ణువు దగ్గర అలా కూర్చుంటారు. పోనీ కైలాసానికి వెళ్తే శివుడి దగ్గర కూర్చుంటారు. ఎంతసేపు అలా కూర్చుంటారు. మోక్షం అనే శబ్దానికి అర్థం విడుదల. దేనిలోంచి విడుదల? అజ్ఞానంలోంచి విడుదల. ఇప్పుడు మనం అజ్ఞానం లోంచి విడుదల పొందకపోతే, మరణించిన తరువాత ఎలా పొందుతాము? మాస్టారు చెప్పినా వీడికి పాఠం రాకపోతే, సొంతంగా చదువుకుంటే ఇంకెలా వస్తుంది? మాస్టారు చెప్పినా ఒక అబ్బాయికి పాఠం రావటంలేదు అనుకోండి, వాడు సొంతంగా చదువుకుంటే ఇంక అసలు రాదు. మోక్షం అనే శబ్దానికి విడుదల అని అర్థం. దేనిలోంచి విడుదల అంటే అజ్ఞానం లోంచి విడుదల. అజ్ఞానం మన లోపలే ఉంది. అది అహంకారం రూపంలో ఉంది. దాంట్లోంచి విడుదల పొందటమే మోక్షం. భగవద్గీతలో మోక్షసన్యాస యోగం అని చెప్పారు. మోక్షానికి కూడా సన్యాసం

ఇవ్వటం, మీ బట్టలకి సన్యాసం ఇవ్వటం కాదు. మీ ఇంటికి సన్యాసం ఇవ్వటం కాదు. ఊరికి సన్యాసం ఇవ్వటం కాదు, అసలు మోక్షానికే సన్యాసం ఇచ్చేయమన్నాడు కృష్ణుడు. ఇదేమిటండీ? ఆయన చివరి అధ్యాయంలో ఏం చెప్పాడంటే, మోక్షానికి సన్యాసం ఇచ్చేయమన్నాడు. బంధం అనేది ఉంటే దాంట్లోంచి విడుదల అనే సమస్య వస్తుంది. అసలు ఉంటే కదా అది. బత్తాకాయ మీ చేతిలో పెట్టాను అనుకోండి, అది మీ కళ్ళకి కనిపిస్తుంది. ఈ ఆధ్యాత్మిక రంగంలో నేను మీకు చేసే సహాయం ఇదే. మీ బుద్ధికి అందచెయ్యటం. నా మాటలు మీకు అక్కరలేదు. ప్రతీ ఆదివారం వచ్చి చూసి వెళ్ళమని చెప్పటంలో ఉద్దేశం అదే. మాటలకి అందని వస్తువుని మాటలలో చెప్పవలసి వస్తోంది. ఆలోచనలకి అందని వస్తువుని ఆలోచనలలో బిగించవలసి వస్తోంది. అందుచేత శివుడు దక్షిణామూర్తి అవతారం ఎత్తినప్పుడు మాటలలో చెప్పటం నాకే సాధ్యంకాదు అని చెప్పి ఆయన మౌనం వహిస్తే, మనకెలా సాధ్యమౌతుంది మాటలలో చెప్పటం! ఈరోజు ఇల్లు అంటుకుంది అనుకోండి, పోనీ రేపు ఆర్పుకోవచ్చును అనుకొంటామా? అనుకోము. ఈ వేళ ఆదివారం, రేపు సోమవారం మధ్యాహ్నం పన్నెండు గంటలలోపు మీకు మరణం వస్తుందని ఈశ్వరుడు వచ్చి చెపుతాడు అనుకోండి. అప్పడు మన దృష్టి భోగం మీద ఉంటుందా? మనము ఏమనుకొంటున్నాము అంటే, ఇంకో వంద సంవత్సరాలు బ్రతుకుదాం కదా, తరువాత చూసుకోవచ్చును, తరువాత చూసుకోవచ్చు అనుకొంటున్నాము. అజ్ఞానంలోంచి బయట పడటం విషయం తరువాత చూసుకోవచ్చును అనిపిస్తోంది. ఇల్లు అంటుకొంటే మట్టుకు వెంటనే ఆర్పేస్తాం. కానీ అజ్ఞానంతో కాలిపోతుంటే మట్టుకు తరువాత చూసుకోవచ్చు తరువాత చూసుకోవచ్చు అనిపిస్తుంది.

మీలో ఎవరికైనా రేపే మరణం వచ్చేస్తోంది అని ఈశ్వరుడు వచ్చి చెపుతాడు అనుకోండి. జిలేబి మీదకి, జున్నుమీదకి, భోగం మీదకి మీ మనస్సు వెళ్ళి వాలుతుందా? ఎవరికి వారు ఒక్కసారి ఆలోచించండి. రేపు మరణం మీకు ఖాయం అని మీకు తెలిసినపుడు మీ మనస్సు వెంటనే ప్రకృతి విషయాల మీదకి వెళ్ళటం ఆగిపోతుంది. అప్పడు మీరు ఏమీ సాధన చెయ్యక్కరలేకుండా ఆగిపోతుంది కారణం ఏమిటి? అజ్ఞానం ఉంటే అందులోంచి విడుదల కోసం ప్రయత్నం చెయ్యటం న్యాయం. అది లేదని తెలిసినవాడికి ఇంక అందులోంచి విడుదల ఏంటి? మనస్సుకి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. కొంచెం కూడా సంబంధం లేదు. పైసా కూడా సంబంధం లేదు.

మనం ఒక కుండ తయారు చేసాం. అందులో నీళ్ళు పోస్తాము కుండ నిండా, ఆ

నీళ్ళలో మనకి ఆకాశం కనిపిస్తుంది. అంటే కుండ తయారు చేయకముందు ఆకాశం లేదా? జాగ్రత్తగా వినండి. ఒక కుండ తయారుచేస్తాము. ఆ కుండలో నీళ్ళు పోస్తాము. నీళ్ళు పోసాక మనకి కుండలో ఆకాశం కనిపిస్తోంది. అంటే ఈ కుండ తయారు చెయ్యక ముందు ఆకాశం లేదా! ఒక సంవత్సరమో ఆరు నెలలో వాడేటప్పటకి కుండ పోతుంది. అయితే కుండ పోయినప్పడు ఆకాశం కూడా పోతోందా? కుండ తయారు అయ్యేటప్పడు ఆకాశం ఉంది. కుండ ఉన్నప్పడు ఆకాశం ఉంది. కుండ బద్దలు అయిన తరువాత కూడా ఆకాశం ఉంది. కుండకి ఆకాశానికి ఎలాగైతే సంబంధం లేదో, అలాగే దేహానికి ఆత్మకి ఎట్టి సంబంధం లేదు. దేహం పుట్టకముందు ఆత్మ ఉంది, దేహం తయారు అయ్యేటప్పడు ఆత్మ ఉంది. దేహం ఉన్నప్పడు ఆత్మ ఉంది. దేహం నశించిన తరువాత కూడా ఆత్మ ఉంది. మీ ఇంద్రియాలని వెనక్కి లాక్కోండి. మనస్సుని ముయ్యండి. ఇంద్రియాలని ముయ్యండి. అభ్యాసం చెయ్యండి. మీకు వైరాగ్యం ఉండాలి. ఇవన్నీ గీతలో ఎన్నో విషయాలు చెప్పకొచ్చాడు భగవంతుడు - మనస్సుని మూసేయమని అహంకారాన్ని మూసేయమని, ఇంద్రియాలని మూసేయమని, అభ్యాసం చెయ్యమని, వైరాగ్యం పెంచుకోమని పరమాత్మ చెప్పాడు.

సుఖం బయట ఉందని భ్రాంతి పడుతున్నాము. భ్రాంతి పడటం వల్ల ఇంద్రియాలు బయటికి వెళ్తున్నాయి. లేకపోతే ఇంద్రియాలు వెళ్ళవు అక్కడికి. మీకు భ్రాంతి ఉన్నంతకాలం, మీరు ఎంత సాధన చేసినా ఇంద్రియాలను జయించలేరు. ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని ధ్యానాలు చేసినా, యోగాలు చేసినా, తపస్సులు చేసినా, మీ మనస్సు భ్రాంతి పడుతున్నంతకాలం, మీ మనస్సు లోపలికి మళ్ళదు. బయట సుఖం ఉన్నట్టు మనస్సుకి కనిపిస్తోంది. అది లోపలకు ఎలా వస్తుంది అసలు? ఫలనాచోట సుఖం ఉందని మీ మనస్సుతోటి చూస్తున్నారు. ఇంక లోపలకి ఎలా వెళ్తుంది మీ మనస్సు? మీ మనస్సుకి అక్కడ సుఖం కనిపిస్తోంది. ఈ మెట్టవేదాంతాలు చెప్పి మీ మనస్సుని లోపలకు పంపించమంటే వెళ్ళదు కదా? మీ మనస్సు ఎలా వెళ్తుంది. ఎదురుగుండా సుఖం కనిపించేటప్పడు? దూడకి ఎదురుగా పచ్చగడ్డి కనిపిస్తోంది. దాని కళ్ళు మూసేస్తేమటుకు దాని మనస్సు పచ్చగడ్డి మీదకి వెళ్ళటం మానుతుందా? మన మనస్సులో భయం ఉంటే, ప్రపంచమంతా భయంగా కనిపిస్తుంది. మన మనస్సులో కామం ఉంటే, ప్రపంచం అంతా కామంగా కనిపిస్తుంది. మన మనస్సులో కోపం ఉంటే, ప్రపంచం అంతా కోపంగా కనిపిస్తుంది. మన మనస్సులో స్వార్థం ఉంటే, ప్రపంచం అంతా స్వార్థంగా కనిపిస్తుంది. మీ మనస్సులో లేనిది లోకంలో మీకు కనబడదు. మీ మనస్సులో ఉన్న భయమే అక్కడ

కనిపిస్తోంది అంతే. అసలు భయంలేదు అక్కడ. నన్ను అందరూ ద్వేషిస్తున్నారేమో అని మీరు అనుకుంటారు అనుకోండి మీ మనస్సులో ఉన్న ద్వేషమే అక్కడ కనిపిస్తోంది. శరీరంతోటి అనుభవించే సుఖం కానీ, మనస్సుతోటి అనుభవించే సుఖం కానీ,మన బుద్ధితోటి అనుభవించే సుఖం కానీ, మనం అనుభవించే ఆ సుఖం ఎక్కడినుంచి వస్తోంది? మీకు జున్ను అంటే బాగా ఇష్టం అనుకోండి. జున్నుకి కనుక మీకు సుఖాన్ని ఇచ్చే శక్తి ఉంటే, నేను జున్ను తిన్నప్పుడు కూడా అది నాకు సుఖాన్ని సంతోషాన్ని ఇవ్వాలి, దానికి ఆ గుణం ఉంటే, నిజంగా దానికి సుఖాన్ని ఇచ్చే శక్తి ఉంటే, నేను తిన్నప్పుడు కూడా మీరు అనుభవించే సుఖం నేను కూడా అనుభవించాలి. జున్ను తినటం వల్ల నాకు ఈ సుఖం వస్తోంది అని మీకు అనిపిస్తోంది. అది జున్ను తినటం వల్ల రావటంలేదు. ఆ జున్న తిన్న పనిహేను నిమిషాలు, మీ మనస్సు ఆత్మ వైపు ప్రయాణం చేస్తోంది. అప్పడు ఆత్మకి సంబంధించిన సుఖాన్ని అది పొందుతోంది. కాని జున్ను తినటం వల్ల వచ్చింది అనుకొంటున్నారు మీరు. అప్పడు కూడా మీరు పొందేది ఆత్మసుఖమే. ఇంద్రియాలతో ఏ భోగాన్ని అనుభవించినప్పటికీ మీరు పొందేది ఆత్మసుఖమే. ఏ ఇంద్రియంతో అనుభవించండి మీరు భోగాన్ని. అప్పడు ఆత్మ సుఖమే వస్తుంది. భోగం అనుభవించేటప్పడు తన మనస్సు అంతర్ముఖం అయ్యి ఆత్మ దగ్గరికి వెళ్ళి ఆత్మ సుఖం పొంది, నేను సుఖంగా ఉన్నాను అనిపిస్తుంది. ఈ భోగం వల్ల సుఖం వచ్చింది అని వాడు అనుకుంటాడు. అది నిజం కాదు.

జాగ్రత్తగా ఈ రోజు సాయంత్రం ఇంటికి వెళ్ళిన తరువాత ప్రశాంతంగా ఆలోచించండి. ఏమిటంటే అది, మీకు ఒక కోరిక వచ్చింది అనుకోండి. కోరిక రాకముందు మీరు ఏ పరిస్థితిలో ఉన్నారో, కోరిక నెరవేరిన తరువాత తిరిగి అలాగే అయిపోతారు. కోరిక ఎంతసేపు ఉందో ఆ టైములో మీ మనస్సు అటూ ఇటూ కదులుతూ ఉంటుంది. కోరిక నెరవేరిపోయింది అనుకోండి. కోరిక నెరవేరకముందు ఏ స్థితిలో ఉన్నారో, కోరిక నెరవేరిన తరువాత కూడా ఆ స్థితిలోనే ఉంటారు. మీకు ఏమీ సంకల్పం లేదు, ఇప్పడు సినిమా చూడాలనే సంకల్పం వచ్చింది. సినిమాకి వెళ్ళిపోవాలి. చూసేయాలి సినిమా! మళ్ళీ ఇంటికి వచ్చేసిన తరువాత సినిమా చూడకముందు ఎలా ఉన్నారో, చూసి వచ్చాక అలా అయిపోతారు. మనకు రోగం వచ్చింది అనుకోండి. మందు వాడటం వల్ల మీకు ఆ రోగం పోతే రోగం రాకముందు మీరు ఎలా ఉన్నారో, రోగం తగ్గిపోయిన తరువాత మళ్ళీ అలాగే ఉంటారు. మనుషులు ఏమీ మారరు. అలాగే ఉంటారు మనుషులు. రోగం రాకముందు మీరు ఎలా ఉన్నారో, రోగం తగ్గిపోయిన తరువాత రోగం రాకముందు ఉన్న స్థితి మళ్ళీ వస్తుంది. అంతేకానీ

రోగం పోయిన తరువాత మీకు కొత్త స్థితేమీ రాదు. మీరు ఒకపక్కకి ఒరిగిపోయి ఆలోచించకూడదు. మనకి తలలో మెదడు ఉంటుంది. ఈ మెదడులో ఎడమవైపు బాగా పనిచేసే వాళ్ళకి కొంచెం లౌక్యం ఉంటుంది. లెక్కలు అవీ బాగా వస్తాయి. కొంచెం లౌక్యంగా మాట్లాడుతూ ఉంటారు. ప్రాపంచిక సంబంధించినటువంటి తెలివి ఎక్కువ ఉంటుంది. ఈమెదడులో కుడివైపు పనిచేసేవాళ్ళకి ఆర్ట్స్‌సైడ్, కొంచెం భక్తిమార్గం, కొంచెం పారమార్థిక చింతన ఉంటుంది. మెదడులో రెండుభాగాలు ఉన్నాయి. ఇప్పుడు మీరందురూ ఇక్కడ కూర్చున్నారు కదా. మీ మెదడు ఏ వైపు బాగా పనిచేస్తోందో మీరు చూసుకోండి. మీకు తెలుస్తూ ఉంటుంది. కుడివైపు బాగా పనిచేస్తోందా, ఎడమవైపు బాగా పనిచేస్తోందా చూసుకోండి. ప్రతీ మనిషికీ పని చేస్తే ఎడమవైపు బాగా పనిచేస్తుంది. లేకపోతే కుడివైపు బాగా పనిచేస్తుంది. ఈ మెదడు రెండువైపులా బాగా పనిచేయడం మనం నేర్చుకోవాలి. కుడివైపు బాగా పనిచేస్తోందా, ఎడమవైపు బాగా పనిచేస్తోందా? కానీ సర్వసాధారణంగా నూటికి ఒక్కడు కూడా ఉండడు రెండు వైపులా బాగా పనిచేసేవాడు. ఏదో ఒకవైపే పనిచేస్తూంటుంది. మీరు జాగ్రత్తగా చూసుకుంటే, ఒక పక్కన మొద్దుబారిపోయినట్టు ఉంటుంది మీకు. నేను ఒకసారి ఆపుచేస్తాను మీరు ఆలోచించుకోండి. మెదడులో ఒకవైపు చురుగ్గా ఉన్నట్టు ఉంటుంది ఒకవైపు మొద్దుబారిపోయినట్టు ఉంటుంది. అసలు పని ఉండదు దానికి. పనిఏమీ చెయ్యదు. ఇంట్లో వాడని వస్తువులు ఉంటాయి చూడండి. ఒకో వస్తువు వాడుతూంటాం. ఒకో వస్తువుని వాడకుండా ఓ పక్కన పడేస్తాం. అలాగే మెదడులో కూడా వాడని భాగం అలా మొద్దుబారిపోయినట్టు ఉంటుంది. అయితే మనలో ఉన్న మెదడుని కూడా మనస్సు సృష్టించింది. మీరు ఈ మెదడే ముఖ్యం అనుకొంటున్నారు. కానీ మెదడు ఫైనల్ కాదు, ఇది సుప్రీమ్ కోర్ట్ జడ్జిమెంట్ కాదు. హై కోర్టు జడ్జిమెంట్ మెదడు, సుప్రీమ్ కోర్టు జడ్జిమెంట్ హృదయం.

మా భగవాన్ తత్వం - ఈ ఒక్క మాట మీరు వింటే ఇంక వినక్కరలేదు పుస్తకాలు చదవక్కరలేదు. నేను అనే తలంపేమో అహంకారం, నేను అనేది ఆత్మ. నేను నేను అనుకోకుండా ఎవళ్ళమైనా ఉన్నామా? నేను అనే తలంపు ఉందదండీ, నేను ఉంది. సర్వసాధారణంగా భగవాన్ టీచింగ్‌లో వచ్చే కన్ఫ్యూషన్ ఇదే. ఆత్మకి తలంపు ఉండదు. నేను అనే తలంపు వస్తోంటే, అది అహంకారం, మనలో ఇక్కడ నేను అనే తలంపు లేని వాళ్ళు ఎవరైనా ఉన్నారేమో చూడండి! అయితే అక్కడ నేను ఉంటుంది కానీ తలంపు ఉ ండదు అది ఆత్మ. నేను వేరు, నేను అనే తలంపు వేరు. మనందరం నేను అనే తలంపులో

ఉన్నాం కానీ, ఇంకా నేనుకి వెళ్లలేదు. ఈ విషయం మీకు అర్థం అయితే, భగవాన్ టీచింగ్ అంతా అర్థమైనట్టే. ప్రాపంచిక తలంపులు వచ్చినా, పారమార్థిక తలంపులు వచ్చినా, తలంపు మెదడులో విజృంభిస్తోంది కానీ అది హృదయంలోంచే వస్తోంది. ఈ కళ్లతో కాదు మీరు చూడవలసింది, జ్ఞాననేత్రంతో చూడాలి. ఈ కళ్లతో ఏమీ కనబడదు. ఎంత పండితుడికి అయినా కూడా అర్థం అవ్వదు. నాలుగువేదాలు చదువుకున్న పండితుడికి కూడా అసలు ఏది జ్ఞానమో అర్థం అవ్వదు. ఎందుచేతంటేవాడికి మాయ దారి ఇవ్వటం లేదు. వాడేం చేస్తాడు పాపం!

ఒకడు భగవాన్ దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. భగవాన్ అతనిని మీరు భోజనం చేసారా అని అడిగారు. పోనీ చేస్తే చేసాను అని చెప్పొచ్చు. చెయ్యకపోతే చెయ్యలేదు అని చెప్పొచ్చు. మరి వాడు చదువుకున్నాడు కదా, చదువు ఊరుకోనివ్వదు కదా! నేను భోజనం చేసానో చెయ్యలేదో కూడా అంత తెలియకుండా ఉన్నారా అని అడిగాడు వాడు. అంటే మీరు జ్ఞాని అంటున్నారు కదా అంత తెలియటం లేదా అని. ఇక్కడ మీరు బాగా అర్థం చేసుకోండి, వాడు బాగా చదువుకున్నాడు. వాడికి కూడా మాయ దారి ఇవ్వటం లేదు. వాడు నాలుగు వేదాలు చదువుకున్న వాడు వాడి బుద్ధే అలా ఉంటే, మన బుర్రలు ఎలా ఉంటాయి! మన బుర్రలు తుప్ప పట్టేసి ఉన్నాయి! ఎప్పుడైనా వాడితే కదా మనం బుర్రల్ని అసలు మనం ఎంతసేపు నోరుని వాడుతున్నాం కానీ బుర్రల్ని ఎక్కడ వాడుతున్నాం. మన ఇంద్రియాలలో ఏమీ వాడకుండా వదిలేసింది బుద్ధినే. కాళ్ళూ చేతులూ వాడుతున్నాం, కళ్ళు వాడుకుంటున్నాం. చెవులు వాడుకుంటున్నాం. నోరు వాడుకుంటున్నాం అన్ని ఇంద్రియాలూ వాడుకుంటున్నాం కానీ వాడకుండా వదిలేసింది బుద్ధి ఒక్కదాన్నే! అసలు బుద్ధిని మట్టుకు ఎవరూ ఉపయోగించుకోవటం లేదు. ఆత్మకి దగ్గరగా ఉన్నది అదొక్కటే. ఆత్మకి సన్నిహితంగా ఉన్నదాన్ని వదిలేసాం, ఆత్మకి దూరంగా ఉన్నది వాడుతున్నాం. పూజలు చేసుకోండి మీకుమంచి లోకం వస్తుంది అని నేను చెపితే మీకు సంతోషంగా ఉంటుంది. కానీ మీరు ఆలోచించండి అంటేనే మీకు బాధ కలుగుతోంది. బుద్ధికి పనిచెప్పాలి. బుద్ధికి పని చెప్పటం మానేసాం. బుద్ధికి పని చెప్పాలి కాబట్టి ఆలోచించటం చిరాగ్గా ఉంటుంది. లోకం అంతా ఈ పిచ్చలోనే ఉంది. ఈ పండితుడే కాదు లోకం మొత్తం కూడా ఈ పిచ్చిలోనే ఉన్నాయి. ఏ పిచ్చి? జ్ఞానం అంటే ఇప్పుడు ఈ వేదపండితుడు అడిగిన లాంటి పిచ్చిలోనే ఉన్నారు. జ్ఞానం అంటే, నేను భోజనం చేసానో లేదో చెపితే వాడు దేవుడు అని వీళ్ళు అనుకొంటున్నారు. మీకు ఎంతమంది పిల్లలు, పదిమంది పిల్లలు అండీ అని వాడు

చెపుతాడు అనుకోండి నిజంగా, అయితే వాడు జ్ఞానే అనుకొంటున్నారు. అదే పొరపాటు! మీరు మరణించే రోజు చెపుతాడు అనుకోండి ఒకడు. అది జ్ఞానం అనుకొంటున్నారు. జ్ఞానం కాదది. ఏది జ్ఞానమో తెలియనంత చాలా చిన్నస్థితిలో ఉన్నాం. మన మనస్సులు చాలా చిన్నవి. ఈ చిన్న మనస్సులో పెద్ద ఆత్మ ఎలా పడుతుంది చెప్పండి. మీ దేహం నాకు కనిపిస్తోంది. కానీ మీలో ఉన్న ఆత్మ నాకు కనిపించటం లేదు. అయితే లేదు అని అర్ధమా? ఇప్పుడు మీరు కొబ్బరికాయ కొట్టలేదు అనుకోండి, దేవుడు నాకు వీడు కొబ్బరికాయ కొట్టలేదు అనుకొంటాడా? నిజంగా అనుకొంటే వాడు దేవుడా! భగవద్గీతలో ఏం చెప్పాడంటే, నాకు ఏమీ అక్కరలేదు. మీరు పవిత్రమైన ప్రేమతో నీళ్ళు ఇవ్వండి చాలు అని చెప్పాడే! ఒక పుష్పం ఇవ్వండి చాలు అన్నాడు. రమణస్వామి అంటే జ్ఞాని అని చెప్పకొంటున్నారు. మీరు నన్ను భోజనం చేసారా లేదా అని అడుగుతున్నారు. అంటే నేను భోజనం చేసానో లేదో కూడా మీకు తెలియదన్నమాట. ప్రశ్న అర్థం అయ్యిందా అండీ మీకు? లోకం అంతా ఇదే పిచ్చి. ఆయన నాలుగు వేదాలు చదువుకున్నాడు, మనం చదువుకోలేదు. అంతే తేడా! నువ్వు భోజనం చేస్తే చేసావు అని చెపుతాననుకో మాటవరసకి, చెయ్యకపోతే చెయ్యలేదు అని చెపుతాను అనుకో, అంతమాత్రంచేత నేను జ్ఞానిని అవుతానా, దానికి జ్ఞానానికి సంబంధం లేదు అన్నారు. నువ్వు భోజనం చెయ్యలేదు అనుకో, చెయ్యలేదు అని చెపుతాను. నువ్వు చేసావు అనుకో, చేసావని చెపుతాను, అయితే నేను జ్ఞానని అయిపోతానా? నా స్వరూపం నాకు తెలియదు అనుకో. నువ్వు భోజనం చేసావో లేదో నేను చెపుతాననుకో నేను జ్ఞానని అవుతానా? అంటే నా జ్ఞానాన్ని ఎలా కొలుస్తావు నువ్వు?

మీరందరూ అభివృద్ధిలోకి రావాలని, మీరందరూ క్షేమంగా ఉండాలని, నేను ఎక్కడో హిమాలయ పర్వతాలకి వెళ్ళిపోయో, లేకపోతే అరుణాచలం వెళ్ళిపోయో, కాశీ వెళ్ళిపోయో, మనస్సులో ఒక్కసారి పూర్తిగా స్మరిస్తాను అనుకోండి, నాభావం మీకు ఎక్కువ ఉపకారం చేస్తుంది. ఎందుచేతంటే భావానికి కూడా శక్తి ఉంది. మీ కళ్ళకి కనపడనిది లేదు అనుకొంటున్నారు మీరు. మీ కళ్ళకి కనపడనిది చెవులకి వినపడనిది ప్రతీదీ లేదు అనుకొంటున్నారు. శరీరం పడిపోయిన తరువాత ప్రాణి వెళ్ళేటప్పుడు, ఆ జీవుడు వెళ్ళేటప్పుడు కూడా జ్ఞానికి కనిపిస్తూ ఉంటుంది. మరణించేది ఎవరు? దేహం. దేహం పుట్టింది, దేహం పెరుగుతోంది, దేహం ముసలిది అవుతుంది, దేహం మరణిస్తుంది, ఆత్మకి మరణం లేదు. ఇప్పుడు నేను నేను అంటున్నాము, మరి శవం ఎందుకు అనదు నేను అని? ఈసారి చనిపోయిన శవాన్ని అడగండి మీరు, నువ్వు ఎందుకు నేను అనవు అని. శవానికి కూడా

నోరు ఉందికదా. మరి అది నేను అనదేంటి? దేహం నేను అనదు, ఆత్మకూడా నేను అనదు. మరి ఈ నేను అనేది ఎవరు? దేహానికి కనుక నేను అనే శక్తి ఉంటే, శవం కూడా నేను నేను అనాలి కదా. మరి ఎందుకు అనటంలేదు? మన ఇంట్లో ఎవరైనా చనిపోతే ఏడుస్తాం. అది కూడా అహంకారమే! మరి ఊళ్ళో వాళ్ళు చనిపోతే మనం ఎందుకు ఏడవడం లేదు. మన ఇంట్లో ఎవరైనా ఒక ముసలివాడు చనిపోతే ఏడుస్తాము. రైలు పడిపోయి రెండువేల మంది చనిపోయారని మనం పేపరులో చదువుతాము. అసలు అప్పడు దుఃఖం కూడా రాదు. ఒక్క కన్నీటి చుక్క కూడా రాదు మనకి. కారణం ఏమిటి? ఆ ఏడ్చేది ఎవరు? శవం నేను నేను అని ఎందుకు అనదు? శవం అంటే దేహమే కదా, కొత్తగా రాదు కదా, శరీరమే శవం. శవం అంటే కొత్తగా వస్తుందా ఎక్కడినుంచి అయినా? శరీరం మరణించాక ఈ శరీరాన్ని శవం అంటారు. మరణం అంటే మనకు భయం. మరణించినవాడికి దేహం కనపడదు. మరి నిద్దట్లో మనకి దేహం కనపడటంలేదు. మరి భయం ఎందుకు వెయ్యటంటేదు? ప్రకృతి విషయాలలో ఏ విషయంలోకైతే వెళ్ళి మీ మనస్సు తగులుకుంటుందో, ప్రకృతి విషయాన్ని చూసి మీ మనస్సు అందులోంచి, జలగ ఏవిధంగా అయితే రక్తాన్ని పీల్చుకుంటుందో అలా మీ మనస్సు సంతోషాన్ని పీల్చుకుంటుందో, మళ్ళీ రాబోయే జన్మలలో మీరు అంత సాధన చేస్తేనే కానీ, ఆ ప్రకృతి విషయాన్ని మీ మనస్సు విడిచిపెట్టదు.

మీరు సుఖంగా ఉండాలి, శాంతిగా ఉండాలి. ఆనందంగా ఉండాలి. మీ సుఖానికి కానీ, మీ శాంతికి కానీ, మీ ఆనందానికి కానీ లోకంలో ఏ వస్తువూ కారణం కాకూడదు. లోకంలో ఏ వస్తువు కారణం అయినప్పటికీ అది మీ పీక పట్టుకొంటుంది. మీ సుఖానికి కానీ, మీ ఆనందానికి కానీ, మీ శాంతికి కానీ, ఈ లోకంలో కానీ ఇతర లోకాలలో కానీ ఏ వస్తువు కారణం అయినప్పటికీ, ఆ వస్తువు మీ పీక పట్టుకుంటుంది. మిమ్మల్ని తరిమి తరిమి విడిచిపెటుతుంది. ఆత్మని తెలుసుకోవటానికి మీకు దారి ఇవ్వదు.

ప్రకృతిలో ఎంతదూరం వెళ్ళిపోయామో అంతదూరం వెనక్కి రావలిసిందే మళ్ళీ సాధనలు చేసుకొంటూ, ఎన్ని లక్షల జన్మలు అయినా సరే. చాలామంది ఏమనుకొంటున్నారు అంటే, ఇప్పడు మనిషి జన్మ ఎత్తాము కదా, రాబోయేజన్మ ఇంతకంటే మంచి జన్మ వస్తుందేమో అనుకుంటున్నారు. అలా ఎప్పడూ రాదు. ఒకోసారి పశుజన్మలు కూడా వచ్చేస్తాయి. చాలా మంది ఏమనుకొంటున్నారంటే ఇప్పడు మనిషి జన్మలో ఉన్నాము. రాబోయే జన్మ ఇంతకంటే మంచిది వస్తుందేమో అనుకొంటున్నారు. అలా రూలు ఎక్కడా

లేదు. ఒకోసారి నీచ జన్మలు వస్తాయి. మనని మొట్టికాయలు కొట్టేవాడు ఉండాలి! మనకి పడే మొట్టికాయలు నాలుగు మొట్టికాయలు పడితేనే కానీ భ్రాంతి మట్టుకు మామూలుగా విడిచిపెట్టదు. స్వామి వివేకానంద అంతటి వాడికే తప్పలేదు. వివేకానంద తండ్రి ప్లీడరు. ఆయన ఉండగా ఏదో పని నిమిత్తం అందరూ వస్తూండేవారు. మనకి ఎంత బలగం ఉందీ, ఎంతమంది బంధువులు వస్తున్నారు మన ఇంటికి అనుకునేవాడట నరేంద్రుడు. తండ్రిగారు అకస్మాత్తుగా చనిపోయారు. చుట్టాలు రావటం తగ్గిపోయింది. స్నేహితులు రావటం తగ్గిపోయింది. రోడ్డుమీద ఎక్కడైనా వివేకానందకి వాళ్ళ బంధువులు కనిపిస్తే తలవంచుకొని పలకరించకుండా వెళ్ళిపోతూ ఉండేవారట. ఎందుచేతనంటే వీడు ఇబ్బంది పడుతున్నాడు. ఏ పది రూపాయలు అయినా అప్పు అడుగుతాడేమో వీడు అని. వీళ్ళందరూ మన బంధువులు అనుకున్నాం, వీళ్ళందరూ మన స్నేహితులు అనుకున్నాం. మన ఇంటికి వచ్చి పలకరించేవారు. ఇప్పుడు ఎవరూ పలకరించటం లేదు. ఇదంతా భ్రాంతా, నిజమా? అంత మేధావికే మొట్టికాయలు తగిలితేనే కానీ ఆ భ్రాంతి ఊడలేదు. భ్రాంతి అంటే సంతోషంలేనిచోట సంతోషం ఉందనుకుంటారు. శాంతిలేనిచోట శాంతి ఉందనుకుంటారు. సుఖం లేని చోట సుఖం ఉందనుకుంటారు. అదే భ్రాంతి.

భగవంతుడి కోసం మీలో ఎవరైనా మీ ధనాన్ని కానీ మీ దేహాన్ని కానీ ఖర్చు పెట్టారా? దేహానికి ఖర్చు పెట్టుకొంటున్నారు, బట్టలకి ఖర్చు పెట్టుకొంటున్నారు. తిండికి ఖర్చు పెట్టుకొంటున్నారు. మంచిదే దేహం ఉన్నంతసేపూ తిండి తినాలి. ఈ ప్రజలు ఎలా ఉంటారంటే భగవాన్ అరుణాచలం వెళ్ళిన కొత్తలో మీరు అన్నం తింటారా అని అడగటం మానేసి, ఏవో హారతి కర్పూరం బిళ్ళలు వెలిగించేవారు అయన దగ్గర. మీకు నిజంగా పరమేశ్వరుడి పాదాలయందు భక్తి ఉంటే, మీ మనస్సు అక్కడ ఉంటే, ఎన్ని జన్మలు వస్తే మట్టుకు మీకు నష్టం ఏమిటి, రానివ్వండి. మీరు జిన్నూరులో పుట్టండి, కాశీలో పుట్టండి, అమెరికాలో పుట్టండి, ఏదేశంలో పుడితే ఏముంది, ఈశరీరం ఎక్కడ పుడితే ఏముంది, మనస్సు పరమేశ్వరుడి మీద లగ్నం అయ్యి ఉంటే? పరమేశ్వరుడి పాదాలయందే మీ మనస్సు లగ్నం అయ్యి ఉంటే, ఏ జన్మ అయితే మనకి నష్టం ఏంటి అసలు! స్త్రీ జన్మ అయితేనేం, పురుష జన్మ అయితేనేం, దూడ జన్మ అయినా ఫరవాలేదు. మనిషి జన్మ ఎత్తి భక్తి లేకుండా ఉండటంకంటే, పశుజన్మ ఎత్తి భక్తి కలిగి ఉండటం మంచిది. జ్ఞాపకం ఉంచుకోండి, కొన్ని జంతువులు చాలా భక్తిగా ఉంటాయి. మనుషులకి కూడా అంత భక్తి ఉండదు. భగవాన్ శరీరం విడిచిపెట్టే సెకనులో ఒక నెమలి వచ్చి ఎంత కన్నీరు కార్చిందో లెక్కలేదు. ఎవరు

చెప్పారు దానికి భగవాన్ పోతున్నారని? ఎవరు చెప్పారు దానిని కన్నీరు కార్చమని. చచ్చిపోవటం అనేది నిజం కాదు, అది తలంపే. మీకు నిద్దట్లో చావు గొడవ ఎక్కడ ఉంది అసలు? మీకు నిద్దట్లో చావు గొడవ కానీ, పుట్టుక గొడవ కానీ ఏమీ లేదు. నేను మరణిస్తున్నాను అనుకోవటం కూడా ఒక తలంపే. తలంపు లేనప్పుడు మరణం లేదు, తలంపు లేనప్పుడు దుఃఖం లేదు, తలంపు లేనప్పుడు అసూయ లేదు. అనవసరమైన విషయాలకి మనం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాం. కొంతమంది అడుగుతారు మేము మరణించిన తరువాత ఎక్కడ పుడతాము అని. అది జ్ఞానమా! మీరు తిరిగి ఎక్కడ పుడతారో నేను చెపుతాను అనుకోండి. అది జ్ఞానమా? నా స్వరూపం నాకు తెలియనప్పుడు మీరు ఎక్కడ పుడతారో నేను తెలుసుకుని చెపుతాను అనుకోండి, అది జ్ఞానం కాదు! ఇది ఎంత అబద్ధమో అదీ అంతే అబద్ధం. ఈ లోకం ఎంత నిజమో అదీ అంతే నిజం. అది నాది. ఇది నాది అని జీవితం పొడుగునా ఇలా అనుకొంటూంటాను. ఈ శరీరం కూడా నాది కాదన్న సంగతి కూడా నాకు తెలియదు. వాడు మరణించే వరకూ ఇలాగే అనుకొంటాడు. ఇదే మంత్రం వాడికి. వాడి శరీరం కూడా వాడిది కాదన్న సంగతి వాడికి తెలియటం లేదు.

మిమ్మల్ని సాధనలు చెయ్యమని, బాధలు పడమని నేను చెప్పటంలేదు. మీరేమీ నష్టాలు పడొద్దు, కష్టాలు పడొద్దు. కొంతమంది అనుకొంటూంటారు. మేము పుణ్యాలు చేస్తున్నాము అని. పుణ్యాలు మంచివే నేను కాదనటం లేదు. పుణ్యం చేస్తే దానికి సంబంధించిన సుఖం వస్తుంది. అనుభవిస్తారు పోతుంది, కానీ అజ్ఞానం మట్టుకు బయటికి వెళ్ళదు. పుణ్యం వేరు విచారణ వేరు! మతం అంటే పుణ్యం అనుకొంటున్నారు, మతం అంటే జీవిత విధానం. మనకు విచారణ రావాలి. పుణ్యం చేస్తే దానికి ఫలితం వస్తుంది, అనుభవిస్తారు, అయిపోతుంది. నన్ను నేను తెలుసుకోవాలంటే, నన్ను నేను రెండు నేనులు అయిపోయినవి ఇప్పుడు. ఉన్నది ఒకటే, ఇంకా తెలుసుకోవటం ఏముంది? నిన్ను నువ్వు తెలుసుకో అంటే, నిన్ను అంటే ఆత్మ, నీవు అంటే అక్కడ అహంకారం. ఈ అహంకారం తోటి ఆత్మని తెలుసుకో, కానీ ఉన్నది ఒకటే.

మీ దేహాన్ని కానీ, మీ ధనాన్ని కానీ, మీ బుద్ధిని కానీ ఉపయోగించుకొని అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి మీ జీవితంలో మీరు ఎప్పుడైనా ప్రయత్నం చేసారా? మీరు పూజలకోసం డబ్బు ఖర్చు పెట్టుకొంటున్నారు, యాత్రలకోసం డబ్బు ఖర్చు పెడుతున్నారు, బాగానే ఉంది. మీ అజ్ఞానాన్ని పోగొట్టుకోవటం కోసం డబ్బు ఎవరైనా ఖర్చు పెట్టారా? కనీసం ఒక్క రూపాయి

అయినా ఖర్చు పెట్టారా ఇక్కడ ఎవరైనా? మీ అజ్ఞానాన్ని పోగొట్టుకోవటం కోసం మీ దేహాన్ని ఎప్పుడైనా ఉపయోగించుకున్నారా, మీ మనస్సుని ఉపయోగించుకున్నారా? మీ తెలివిని ఉపయోగించుకున్నారా? మీ బుద్ధిని ఉపయోగించుకున్నారా? మీ ఇంద్రియాలని ఉపయోగించుకున్నారా? అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి ఉపయోగించకపోతే, ఈ దేహం వచ్చిన ప్రయోజనం దేనికి? చెట్లు పుడుతున్నాయి చచ్చిపోతున్నాయి, జంతులు పుడుతున్నాయి చనిపోతున్నాయి. అదేవిధంగా మనుషులు పుడుతున్నారు, పెరుగుతున్నారు, చనిపోతున్నారు. అజ్ఞానంతోటి అవీ చనిపోతున్నాయి, మనమూ చనిపోతున్నాము, ఇంక మనుషులమని చెప్పకోవటానికి మనకి గుర్తు ఏముంది? ఎందులో మన ఔన్నత్యం? ఈ లోకంలోకి వచ్చి వెళ్ళిన గుర్తు అయినా ఉంటుందా? మన పేరు ఎవరైనా చెపుతారా? మనం ఈ రోజున మరణిస్తే, ఈ లోకంలోకి వచ్చిన గుర్తు అయినా ఉంటుందా? నీటిమీద గుర్తు ఒక సెకను అయినా ఉంటుందేమో కానీ మనం వచ్చి వెళ్ళిపోయిన జాడ ఎవరికైనా కావాలా? మనం వచ్చి వెళ్ళిపోయిన తరువాత మన జాడ కానీ, మన గుర్తు కానీ, మన రూపు కానీ ఎవరికైనా కావాలా? ఒక మనిషి ఈ లోకంలోకి వచ్చాడు, వెళ్ళిపోయాడు, గుర్తు ఉంటుందా లోకానికి? చెప్పండి మీరు ఏమి సాధిస్తారో జీవితంలో, ఏమి సాధిస్తారు లోకంలో. నా దగ్గర ఎంతో డబ్బు ఉందనుకోండి, నాకు ఎంతో కీర్తి ఉందనుకోండి, కానీ నాకు దుఃఖం వస్తూ వుంటే ఇవన్నీ నాకు ఎందుకు? నాకు ఎంతో డబ్బు ఉంది, లేకపోతే ఎంతో చదువు ఉంది, ఎంతో కీర్తి ఉంది. ఇవన్నీ ఉన్నప్పటికీ నాకు దుఃఖం వచ్చేస్తోంది, ఇవన్నీ ఏం చేసుకుంటాను నేను అసలు. నాకు దుఃఖం వస్తుంటే, నాకున్న అధికారం మటుకు నేనేం చేసుకుంటాను.

అన్నం దొరకదు అంటే భయపడతాము. ఎవరైనా జ్యోతిష్కుడు మీరు దరిద్రం అనుభవిస్తారు అని మనకి చెపుతాడు అనుకోండి, ఎంత భయం వేస్తుంది మనకి? మరి దరిద్రం గురించి అంత భయపడేటప్పుడు, అజ్ఞానం గురించి ఎందుకు భయపడడు మానవుడు? దరిద్రం వస్తుందంటే భయం వస్తోంది కదా, మరి అజ్ఞానం గురించి ఎందుకు బాధపడటం లేదు మనం? మరి దరిద్రంలో ఉండకూడదనుకుంటున్న మనిషి అజ్ఞానంలో ఉండాలని ఎందుకు అనుకొంటున్నాడు. అజ్ఞానం పోగొట్టుకోవటానికి ఎందుకు ప్రయత్నం చెయ్యటం లేదు? మీకిప్పడు 40 సంవత్సరాల వయస్సు ఉంటే, కనీసం ఎన్ని గంటలు, ఎన్ని రోజులు మీరు అజ్ఞానాన్ని పోగొట్టుకోవటం కోసం మీరు ప్రయత్నం చేసారు? ఈశ్వరుడు మిమ్మల్ని అడుగుతాడు అనుకోండి, ఎన్ని రోజులు నా కోసం నువ్వు ఖర్చు పెట్టావని, ఏమని చెపుతారు, మన ముఖాలు ఎలా చూపిస్తాం ఆయనకి? మనం మరణించిన తరువాత

ఈశ్వరుడు అడుగుతాడు, మీరు అజ్ఞానాన్ని తొలగించుకోవటం కోసం ఎన్ని రోజులు, ఎన్ని గంటలు ఖర్చుపెట్టావు నువ్వు అని అడిగితే ఏం చెప్పగలం? కొంతమంది మంచి చెయ్యకపోయినా, మంచి చేస్తున్నట్టు నటించి ఈశ్వరుడి దగ్గర కూడా గెంటుకెళ్ళిపోయి ముందు కుర్చీలలో కూర్చుంటారట. లోకంలో మనుషులని ఎలా మోసం చేస్తారో అక్కడ కూడా ఈశ్వరుడి దగ్గర మామూలు జనాన్ని గెంటేసి, భక్తులని గెంటేసి, ముందు కుర్చీలలో కూర్చుంటారు. అప్పుడు ఈశ్వరుడు అంటాడట, మీరెవరో నాకు తెలియదు, మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు. ముందు కుర్చీలలో కూర్చుంటే, ప్రెజంటేషన్స్ బావుంటాయని వీళ్ళ ఉద్దేశం. లోకంలో ఉన్న అలవాటు అది. మీరు ఎవరో నాకు తెలియదు, మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు అంటాడు, ఎప్పుడైనా లోకంలో ఉండగా ఈశ్వరుడితో సంబంధం పెట్టుకుంటే కదా అసలు వాళ్ళు!

ఒక్క రెండు నిమిషాలు చాలు, మీరు కాళ్ళు చేతులు కదపకుండా మనస్సు నిర్మలంగా పెట్టుకొని కూర్చోగలరా? మనస్సులో మలం ఉన్నంతకాలం ఏ మనిషికీ మాయ దారి ఇవ్వదు. మన శరీరంలో మలం ఎలా ఉంటుందో, మనస్సులో కూడా మలం ఉంటుంది. మలం అంటే పాపం. మనస్సులో మలం ఎక్కువగా ఉంటే, ఇంక ఈ ప్రకృతి, మాయ వాడికి దారి ఇవ్వదు. ప్రతీ ఆదివారం ఎందుకండీ మీరు శ్రమపడి వెళ్తారు అని ఎవరైనా అంటారనుకోండి, వాడిని చూసి మీరు కంగారు పడతారేంటి? వాడి మనస్సులో ఉన్న మలం అలాంటిది. అంటే వాడి తప్పు కాదు, వాడి మనస్సులో ఉన్న మలం వాడి నోటితోటి ఆ మాట అలా అనిపిస్తుంది. అయ్యో వీళ్ళు ఇలా అంటున్నారేమిటి? అని మీ సొంత ఆలోచన పోగొట్టుకుంటారు. అంటే మీకు సొంత ఆలోచనలు లేవా, మీకు సొంత బుర్రలు లేవా? వాడి బుర్రమీద ఎంతకాలం మనం బ్రతుకుతాం? ఎవడో ఏదో అన్నాడని వాడి బుర్రమీద మీరు ఎంతకాలం బ్రతుకుతారు?

బంగారపు గొలుసు ఉందనుకోండి, చెడగొట్టేయండి బంగారం అయిపోతుంది, బంగారం కంటి ఉందనుకోండి, చెడగొట్టేయండి బంగారం అయిపోతుంది. బంగారం పోదు, ఆకారం పోయింది. జీవరూపంలో ఉన్నది కూడా ఈశ్వరుడే. ఈ లోకం అంతా కూడా ఈశ్వరుడిదే, ఈశ్వరుడితోటి నిండి ఉంది ఈ లోకం. లోకం అంతా వ్యాపించి ఉన్న ఈశ్వరుడిని చూడటానికి అలవాటు చేసుకోవటానికే మనం గుళ్ళో ఉన్న దేవుడిని చూడటం కూడా రమణస్వామి తోటి ఎవరో చెప్పారట, స్వామీ మీ విగ్రహం మద్రాసులో తయారు చేస్తున్నారు, తొందరలోనే వచ్చేస్తుంది అరుణాచలం అన్నారు, అవును మరి రాతి

మనుషులందరికీ రాతి విగ్రహాలు ఉండాలి అన్నారు. డబ్బుని అనవసర విషయాలకి ఖర్చు పెట్టటం వల్ల ఎంత దోషం వస్తుందో ఎంత పాపం వస్తుందో, మనస్సుని అనసర విషయాలకి ఖర్చు పెట్టటం వల్ల కూడా అంతే పాపం వస్తుంది. మీకు పుణ్యం సంపాదించుకునే శక్తి లేకపోతే వదిలేయండి, కానీ పాపం చెయ్యకండి. వ్యర్థమైన కోరికలతో, వ్యర్థమైన తలంపులతో, వ్యర్థమైన ఊహలతో మీ మనస్సులో ఉన్న శక్తిని ఖర్చుపెట్టకండి. మీ శక్తిని ఉపయోగించుకొని పరమేశ్వరుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. అవసరం లేని గొడవలన్నీ తీసుకొచ్చి మీ మనస్సులో నింపుకోకండి. ఈశ్వరుడు బహుమతి ఇవ్వటం మర్చిపోతాడని మీరు అనుకోవద్దు. మీ ప్రయత్నాలకి బహుమతి ఇస్తాడు, మీ సాధనలకి బహుమతి ఇస్తాడు, మీరు చేసిన నామానికి బహుమతి ఇస్తాడు.

సోదరమహాశయులారా! మీకు ఏ రకమైన కోరిక ఉన్నా, అది నెరవేర్చకుండా ఈశ్వరుడు విడిచిపెట్టడు, ఏమీ వద్దు అంటే మీరు మోక్షంలో ఉన్నట్టే, నిజంగా అంటే అది. మాకు ఏమీ కోరికలు లేవు, మాకేమీ ఆలోచనలు లేవు, మాకేమీ తలంపులు లేవు, అన్నీ వదిలేసాం అని ముసలివాళ్ళు అనుకుంటూ ఉంటారట. కాయ పైకి పండిపోయినట్టే ఉంటుంది కానీ లోపల గింజలు గట్టిగా ఉంటాయి. ఈ ముసలివాళ్ళు అందరి సంగతి అంతే అన్నాడు రవీంద్రనాథ్ ఠాగూర్. ముసలివాళ్ళు అందరూ ఎటువంటి వారంటే, పండిన పండు వంటివారు. పండు చూస్తే మెత్తగా ఉంటుందట, మెత్తగా ఉందని విడదీసి చూస్తే లోపల గింజలు గట్టిగా ఉంటాయట. ముసలివాళ్ళ శరీరం అయితే ముసలిది అవుతుంది కానీ లోపల వాసనలు గట్టిగా ఉంటాయట. ఆ వాసనలు ఎందుకు గట్టిగా ఉంటాయట, ఈ కాయలో గింజలు మళ్ళీ మొలకెత్తటానికి ఎలా ఉపయోగపడతాయో, అలా ఈ ముసలివాళ్ళలో ఉన్న వాసనలు మళ్ళీ జన్మ రావటానికి ఉపయోగపడుతున్నాయి. వీళ్ళు అనుకుంటారట మేము అన్నీ వదిలేసుకున్నామండీ అని. ఒట్టిదే, శరీరంలో శక్తి లేక వదులుకున్నారు, వాసనలు గట్టిగానే ఉంటాయి వీళ్ళకి!

మా చుట్టం ఒకతను ఉన్నాడు, ఆయనకి తొంభై ఏళ్ళు వచ్చాయి. ఆయనొక రోజున మనవడితో చెపుతున్నారు, అబ్బాయీ చేనుకి కంత కట్టేసావో లేదో చూడు అని. ఆయనకి తొంభై ఏళ్ళు, చేనుకి కంత కట్టకపోతే నీళ్ళు వెళ్ళిపోతాయి అని కంత కట్టేసావో లేదో చూడు అంటున్నారు. ఆ మనవడు అంటున్నాడు, మీరు ఊరుకోండి మీకెందుకీ గొడవ, మేము చూసుకుంటాము చేనుకి కంత కట్టాలో లేదో. మీకెందుకు అనసవరం గొడవలు అన్నీ అన్నాడు. పోనీ అలాగే చేస్తాను అని చెపితే సరిపోతుంది కదా! ఏదో పేచీ కోసం, మీరు

చెప్పాలా మాకు అన్నాడు. అప్పుడు ఆ ముసలాయన అన్నాడు నేను చెప్పకుండా నువ్వు కడితే కట్టొచ్చు. కానీ ఎన్నో సంవత్సరాలు వ్యవసాయం చేసాను, అలవాటు చొప్పన చెపుతున్నాను అన్నాడు. పోనీ అలాగే చేస్తాను అని అంటే నష్టం ఏంటి వీడికి? ఏమైనా అరిగిపోతుందా? కరిగిపోతుందా? ఇదంతా ఎందుకు చెపుతున్నాను అంటే ఆయన వ్యవసాయం చెయ్యటం అయిపోయింది కానీ ఆ వాసన మనస్సులో ఉండిపోయింది ఆయనకి. కాయ మెత్తబడిపోయినా లోపల గింజలు గట్టిగానే ఉంటాయి. ముసలివాళ్ళ పరిస్థితి కూడా అంతే. అందుచేత ముసలివాళ్ళు అందరూ మాకు అజ్ఞానం పోయింది అనుకోవటానికి వీలులేదు. కొంతమంది ఏమంటారంటే, ఇప్పటినుండీ జ్ఞానం గొడవ ఎందుకండీ ముసలివాళ్ళమైన తరువాత చూసుకోవచ్చును కదా అంటారు. అంటే ముసలివాళ్ళకే కానీ జ్ఞానం పడుచువాళ్ళకు అక్కరలేదా? వయస్సులో ఉన్నప్పుడు అజ్ఞానంగా ఉండాలా?

కొండ వచ్చి మీ మీద పడుతున్నప్పటికీ మీరు శాంతిని విడిచిపెట్టవద్దు. భక్తి విశ్వాసం రెండూ కూడా మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. కొంతమంది భగవాన్ ముందు కూర్చుని మనస్సులో ఏదో కోరికలు కోరుకునేవారట. కొంతమంది మాకు అది కావాలి ఇది కావాలి అని కూడా భగవాన్ని అడిగేవారట. ఒకసారి ఒక అబ్బాయిని భగవాన్ అడిగారట, అబ్బాయీ నీకేమి కావాలి అని. ఆ అబ్బాయి నాకు ఏమీ అక్కరలేదు అన్నాడట. ఎన్నాళ్ళకి దొరికావు నా జాతి వాడవు నువ్వు అన్నారు భగవాన్. నాకేమీ అక్కరలేదు అని నువ్వు చెపుతున్నావు, అందరూ ఏదోటి అడిగేవారే. నువ్వు ఒక్కడివే చెపుతున్నావు ఏమీ అక్కరలేదని. ఎన్నాళ్ళకి దొరికావు నా జాతి వాడవు అన్నారు! ఒకసారి భగవాన్ కొండమీద నుండి నడిచి దిగి వస్తోంటే, వెళ్ళి ఆయన కాళ్ళు పట్టుకోమని చెప్పారట ఒక అబ్బాయికి. ఈ అబ్బాయికి తెలియదు కదా పాపం. వెళ్ళి గట్టిగా కాళ్ళు పట్టుకున్నాడు. తల్లి తండ్రులు చెప్పారు ఆ మాట, భగవాన్ కాళ్ళు గట్టిగా పట్టుకోమని. వీడు వెళ్ళి కాళ్ళు పట్టుకున్నాడు. అప్పుడు భగవాన్ అడిగారట, నీకు ఏం కావాలి అని. వాడికి సొంత అనుభవం లేదు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు, చిలకపలుకులు అన్నమాట. నాకు మోక్షం కావాలి అన్నాడు అప్పుడు భగవాన్ అన్నారు నేను కాదురా నీకు మోక్షాన్ని ఇచ్చేది, ముందు నువ్వు నాకు మోక్షం ఇయ్యి లేకపోతే పడిపోతాను, మోక్షం అంటే విడుదల.

మిమ్మల్ని అన్ని వస్తువులతోటి అలంకరిస్తాడు ఈశ్వరుడు. మీకు ఏరోజున ఏది అవసరమో ఈశ్వరుడికి తెలుసు. మీరు అప్లికేషన్ పెట్టక్కరలేదు, పిటిషన్ పెట్టక్కరలేదు.

నేనుని మనస్సుకి పరిమితం చెయ్యకండి, మీ తలంపుకి పరిమితం చెయ్యకండి నేనుని, అహంకారానికి పరిమితం చెయ్యకండి నేనుని. జ్ఞానికి అజ్ఞానికి ఒకటే తేడా, నేను ఆత్మని నాకో శరీరం ఉంది అనుకుంటాడు జ్ఞాని, అజ్ఞాని ఏమనుకుంటాడు అంటే నేను శరీరాన్ని నాకు ఒక ఆత్మ ఉంది అనుకుంటాడు. అదే జ్ఞానికి అజ్ఞానికి తేడా. మీరెవరైనా ఎప్పుడైనా ఒక గంటో అరగంటో పదినిమిషాలో ఈశ్వరుడిని ప్రేమించారా? మీ మనవలని ప్రేమించినట్టు ఈశ్వరుడిని ఎప్పుడైనా ప్రేమించారా మీరెవరైనా? ప్రేమించిన మాట నిజమే అయితే మీరు ఈశ్వరుడిని ఎప్పుడూ ఏమీ అడగరు. ప్రేమ దగ్గర అడిగే స్వభావం లేదు.

యదార్థం ఏది అంటే తన స్వరూపమే యదార్థం. ఈ యదార్థాన్ని తెలుసుకోవటమే మీరు లక్ష్యంగా పెట్టుకుంటే, సత్యాన్ని దర్శించాలని కనుక లక్ష్యంగా పెట్టుకుంటే, ఈ లోకానికి సంబంధించిన ఎరుక ఈశ్వరుడు మీకు ఇస్తాడు. కష్టపడి చదువుకునే అబ్బాయికి తల్లితండ్రులు వాడికి ఏది కావాలో చూస్తూ ఉంటారు. వాడు శ్రద్ధగా చదువుకుంటున్నాడు, వాడికేది కావాలో మనమే చూడాలని తల్లితండ్రులే చూస్తారు. అదేవిధంగా మీరు సాధన చేసుకుంటూ, కేవలం మీ స్వరూపాన్ని తెలుసుకునే ప్రయత్నంలో కనుక మీరు ఉంటే, మీకు లోకానికి సంబంధించిన అవసరాలుంటే ఈశ్వరుడు చూస్తాడు.

ప్రకృతి అన్నా మాయ అన్నా ఒకటే. ఏ జన్మలో అయితే మీరు సత్యాన్ని తెలుసుకున్నారో, ఆ జన్మలో ఇంక ప్రకృతి మీ జోలికి రాదు. మిమ్మల్ని విడిచిపెట్టేస్తుంది. సత్యం తెలియనంత కాలం మిమ్మల్ని ప్రకృతి తరుముకుంటూనే వస్తుంది. మనస్సు చిక్కగా ఉంటే మట్టుకు విచారణకి పనికి రాదు. మనస్సు చిక్కగా ఉండకూడదు, పల్చగా ఉండాలి. బాగా పలచగా ఉండాలి మనస్సు. నేను ఒక పని చేస్తున్నాను అనుకోండి, ఆ పని బంధించదు మనల్ని, నేను చేస్తున్నాను అనే భావనే బంధిస్తుంది అన్నారు భగవాన్. పని బంధించదు కానీ ఆ పని నేను చేస్తున్నాను అన్న భావనే బంధిస్తుంది. కొంతమంది మహాత్ములు పుట్టుకతోనే మహాత్ములుగా పుడతారు, కొంతమంది లోకంలోకి వచ్చి గొప్ప గొప్ప కార్యాలు చేసి గొప్ప గొప్ప పనులు చేసి మహాత్ములు అనిపించుకుంటారు. ఇంకా మూడో రకం ఉంటారు, వాళ్ళు మహాత్ములుగా పుట్టరు, గొప్ప పనులు కూడా వాళ్ళేమీ చెయ్యరు. (కానీ మమ్మల్ని మహాత్ములు అనుకోండి అని లోకాన్ని పీడిస్తారు.) ఈ లోకంలో అద్భుతమైన కార్యాలు ఏమీ సాధించరు. మానవజాతికి ఉపయోగపడే పనులు ఏమీ చెయ్యరు. కానీ మమ్మల్ని మహాత్ములు అని గుర్తించమని లోకాన్ని పీడిస్తారు అని చెప్పాడు షేక్స్పియర్. ఈ రకం మహాత్ములతోటే లోకం అంతా నిండి ఉంది. మీరు దేశానికి సేవ చెయ్యొద్దు, ఊరికి సేవ

చెయ్యొద్దు, లోకానికి సేవ చెయ్యొద్దు, నీ జీవితంలో ఎప్పుడైనా ఏ ఒక్క వ్యక్తికైనా ఒక్క ఉపకారం అయినా చేసావా అని అడిగారు రామకృష్ణ పరమహంస. నువ్వు ఊరికి సేవ చెయ్యొద్దు, దేశానికి సేవ చెయొద్దు, లోకసేవ చెయ్యొద్దు, నీ జీవితంలో ఏ ఒక్క వ్యక్తికైనా ఒక చిన్న ఉపకారం చేసావా, ఓ చిన్న దీపాన్ని ఎప్పుడైనా వెలిగించావా అని అడిగారు.

ఒక అమ్మాయి నలభై సంవత్సరంలో పోయింది, స్కూల్లో ఉద్యోగం చేస్తూ చచ్చిపోయింది, పెళ్ళి చేసుకోలేదు, కొంతమంది చదువుకునే పిల్లలకి, ఎవరికీ తెలియకుండా సహాయం చేసేది, వాళ్ళలో ఈ అమ్మాయి వల్ల బాగా సహాయం పొందిన ఒక అబ్బాయి శవం దగ్గరకి వచ్చి చేతులు పట్టుకొని ఏడుస్తున్నాడు. ఆ శరీరాన్ని ఇంకెక్కడా ముట్టుకోవటం లేదు ఏంటి, తలకాయ ముట్టుకోవటం లేదు, కాళ్ళు ముట్టుకోవటం లేదు, పోనీ కాళ్ళకి నమస్కారం పెట్టు. అలా చేతులు పట్టుకొని ఏడుస్తున్నావేంటి అని అక్కడ ఉన్నవాళ్ళు ఎవరో అడిగారు ఈ చదువుకునే అబ్బాయిని. ఎవరికీ తెలియకుండా ఈ చేతులు నాకు ఎంతో సహాయం చేసాయి. ఇప్పుడు చేతులు కదలటం లేదు. అందుకే చేతులు పట్టుకొని ఏడుస్తున్నాను. చేతులు అటు ఇటు కదలటం లేదు, రా అబ్బాయి ఎప్పుడు వచ్చావని, నోరు మాట్లాడటం లేదు. ఈ చేతులు ఎంత సహాయం చేసాయో, ఇంత సహాయం చేసిన చేతులు ఇలా పడి ఉన్నాయి. అందుకే చేతులు పట్టుకొని ఏడుస్తున్నాను అన్నాడు.

కుడిచెయ్యి చేసే పని ఎడమచేతికి తెలియనివ్వకండి. ఎవరికీ తెలియకుండా చేసిన దానం చూసే ఈశ్వరుడు మీకు బహుమానం ఇస్తాడు. ఎవరికైనా తెలియాలని మీరు అనుకోవటం ఎందుకు? ఈశ్వరుడు చూస్తున్నాడు కదా! ఈశ్వరుడికి తెలుసు కదా, సంతోషించవలసినది ఈశ్వరుడు, ప్రజలు కాదు. మీకు మోక్షం ఇచ్చేది ఈశ్వరుడు, ప్రజలు కాదు. ఈ స్నేహాల సంబంధాలు అన్నీ తెగిపోతాయి. ఎన్ని జన్మలు ఎత్తినా ఎన్ని లోకాలకి వెళ్ళినా, విడదీయలేని సంబంధం, తెంపుకోలేని సంబంధం ఏది అంటే ఈశ్వరుడి ఒక్కడితోటి సంబంధం. ఈ బంధుత్వాలు నిజం కాదు, ఈ స్నేహాలు నిజంకాదు, ఈ జన్మలు నిజం కాదు. ఒకే ఒక సంబంధం, మనకి మోక్షం వచ్చేవరకు తెగని సంబంధం, ఒకే ఒక్క సంబంధం. అదే బంధం, అదే సంబంధం! భార్యాభర్తల సంబంధాలు కూడా నిజం కాదు. తల్లితండ్రుల సంబంధాలు నిజం కాదు, స్నేహితుల సంబంధాలు నిజం కాదు, ఏ సంబంధమూ నిజం కాదు, ఒకే ఒక సంబంధం నిజం, ఈశ్వరుడితోటి మనకున్న సంబంధం మాత్రమే నిజం. ఏ లోకానికి వెళ్ళినా తెగని సంబంధం విడదీయరాని సంబంధం. అది ఈశ్వరుడితోటి ఉన్న సంబంధం ఒక్కటే. మనం ఎంత తెంపుకుందామన్నా, మనం

నిప్పుల వర్షం కురిపిస్తున్నా, మన మీద ఆశీర్వచనాలు కురిపిస్తున్నాడు, ఈశ్వరుడు తోటి ఉన్న సంబంధాన్ని వదిలేసి కేవలం ఈ లోకం యొక్క నీడని చూసి మోసపోతున్నాము. నా భర్త నన్ను ప్రేమిస్తున్నాడు, నా భర్త నన్ను ఎంతో ప్రేమిస్తున్నాడు అనుకుంటారు, చచ్చిపోతే పన్నెండో రోజు తిరగకుండా వాడు పెళ్ళి చేసేసుకుంటాడు. ఏమిటండీ ఈ ప్రేమ! ఈ ప్రేమ నిజమా ఈశ్వరుడి ప్రేమ నిజమా? నిజంగా తన మనస్సులో తన భార్య మెదులుతూ ఉంటే, తన హృదయంలో కనుక తన భార్య నిజంగా మెదులుతూ ఉంటే, వాడు రెండో స్త్రీని పెళ్ళి చేసుకోడు ఒకడి భార్య నీడగా వచ్చి చెప్పేదట, ఎన్నో రకాలుగా వచ్చి చెప్పేదట, మరణించిన తరువాత కూడా నాలుగు సంవత్సరాలు చెప్పిందట అలాగ. అతను భార్యతోటి, నువ్వు నన్ను ఆ విషయంలో బలవంతం పెట్టకు, నా హృదయంలో నీకు స్థానం ఇచ్చాను, నువ్వు వెళ్ళిపోయావు అక్కడితోటి ఆ సంబంధం తెగిపోయింది అని చెప్పాడు.

ఈ శరీరం మనకి ఎందుకు వచ్చింది అని కనీసం ఒక్కసారి కూడా ప్రశ్న వేసుకోకుండా వంద సంవత్సరాలు జీవించి రాలిపోయిన మనుషులు ఉన్నారు. అన్నీ అబద్ధమైన సంబంధాలే, నిజమైన సంబంధం ఈశ్వరుడితోటి ఉన్న సంబంధమే. కానీ నిజమైన సంబంధాన్ని వదులుకొంటున్నాం, అబద్ధమైన సంబంధాన్ని బలపరుచుకొంటున్నాం. మీ కొడుకు మిమ్మల్ని ఎంతో ప్రేమిస్తున్నాడు అని మీకు అనిపిస్తుంది. అది భ్రాంతి! వాడికి పెళ్ళి అయిన తరువాత తెలియాలి మీ భాగోతమంతా! మీ కొడుకు మిమ్మల్ని ఎంతో ప్రేమిస్తున్నాడు అని, మీ సర్వస్వం, మీ రక్తాన్ని కూడా వాడికోసం ఖర్చు పెడతారు. మీ దగ్గరున్న ధనాన్ని వాడికి ఖర్చుపెడతారు, మీ సర్వస్వం వాడికి ఖర్చు పెడతారు. వాడు ఎంత ప్రేమిస్తున్నాడో మీరు బ్రతికి ఉండగానే తెలిసిపోతుంది వాడికి పెళ్ళి అయిన తరువాత. ఎందుచేతనంటే 90 పైసలు వాటా పెళ్ళానికి ఇచ్చేస్తాడు వాడు. ఒకవేళ మిమ్మల్ని ప్రేమించాలన్నా ఇంక ప్రేమించలేడు వాడు, ఎందుచేతనంటే వాడి దగ్గర ఉన్న వాటా తగ్గిపోతుంది. మహా ఉంటే ఐదు పైసల వాటా ఉంటుందనుకోండి, ఆ ఐదు పైసలతోటి తల్లితండ్రులని ఏం ప్రేమించగలడు ఇంక? తొంభై ఐదు పైసలు భార్యకి ఇచ్చేసాడు, ఇంకో ఐదు పైసలు వాడు అట్టేపెట్టుకుంటాడు అనుకోండి, ఈ ఐదు పైసలతోటి ఏం చెయ్యగలడు? వాడి తప్ప కాదు వాడి దగ్గర ఉన్నది ఐదు పైసలే.

ఒక చదువుకున్న అబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడు, మీ వాళ్ళు అందరూ బాగున్నారా అని అడిగాను. అందరూ బాగున్నారా అంటే వాడి పెళ్ళాం పిల్లలూ అని వాడి ఉద్దేశం. వాడి తల్లితండ్రుల గొడవ వాడికి లేదు. ఆశ్చర్యం చూడండి, మా ఆవిడ బాగానే ఉందండీ అన్నాడు.

నేను ముసలివాళ్ళని దృష్టిలో పెట్టుకొని అడిగాను. ఆ అబ్బాయి తల్లితండ్రులు ముసలి వాళ్ళు అయ్యారు అని అడిగాను అందరూ బాగున్నారా అని. వాడి ఉద్దేశం వాడి కుటుంబం అంటే వాడి పెళ్ళాం, పిల్లలూ అని. అంటే వాడి కుటుంబంలో వాడి తల్లితండ్రులకి చోటు లేదు. ఏ తల్లి కడుపు అయితే చీల్చుకుని వాడు బయటకు వచ్చాడో ఆ తల్లిని పూజించనక్కరలేదు, కనీసం ఆ తల్లి తన కుటుంబంలో ఒక సభ్యురాలు అన్న విషయం కూడా మర్చిపోయాడు. నేను యథాలాపంగా అడిగాను మీ కుటుంబంలో అందరూ బాగున్నారా అని, మా ఆవిడా పిల్లలు అందరూ బాగానే ఉన్నారు అన్నాడు. వాడి తల్లితండ్రులు ముసలివాళ్ళు అయిపోయారు కదా! వాళ్ళు బాగున్నారని చెపుతాడు అని నేను అడిగాను. అందరూ బాగున్నారా అంటే వాడి పెళ్ళాం గురించి, పిల్లల గురించి చెప్పి ఊరుకున్నాడు. అంటే వాడు నిజం చెప్పాడు, హృదయంలో ఉన్నది అదే, పాపం వాడు ఏంచేస్తాడు? హృదయంలో ఉన్నది బయటికి వచ్చేసింది అంతే. కాకరకాయ కూర తింటే, బీరకాయ కూర బయటికి ఎలా వస్తుంది? మనం కాకరకాయ తింటే కాకరకాయ కూరే బయటికి వస్తుంది, కక్కు వస్తే; బీరకాయ కూర బయటికి ఎలా వస్తుంది? వాడి హృదయంలో ఉన్నది అదే, బయటికి వచ్చేసింది.

మనమందరం జ్ఞానంలో ఎదగాలి. శరీరం మన ప్రయత్నం లేకుండానే ఎదుగుతోంది, దానికి ప్రయత్నం అక్కరలేదు. స్మశానంలోకి వెళ్ళటానికి ప్రయత్నం అక్కరలేదు. చచ్చిపోవటానికి ప్రయత్నం ఎందుకండీ? నేచర్ కదా అది! జ్ఞానంలో ఎదగాలి. జ్ఞానంలో ఎదగాలంటే ప్రకృతితోటి పోరాటం ఉంటుంది. ప్రకృతితోటి ఎవడైతే పోరాడలేడో వాడు జ్ఞానంలో ఎదగలేడు. ఎవడైతే ప్రకృతితోటి పోరాడుతున్నాడో వాడు జ్ఞానంలో ఎదుగుతాడు. సర్విచెట్లు ఎలా అయితే ఎదుగుతున్నాయో, ఎంత పొడవుగా ఉన్నాయో, అదేవిధంగా జ్ఞానంలో మనం అంత బాగా ఎదగాలి. మనం జ్ఞానం సంపాదించటం కోసం జన్మించాం, అందుకే జీవించాలి, జ్ఞానం సంపాదించే ప్రయత్నంలోనే మరణించాలి. ముఖానికి కాంతి జ్ఞానమే, ముఖానికి సౌందర్యం జ్ఞానమే, జ్ఞానం లేని ముఖంలో ఏముంది చూడటానికి? చర్మం ఊరికే పల్చగా ఉంటుంది, లోపల మాంసం రక్తం ఉంటుంది. చర్మంలో ఏముంటుంది? చర్మానికి లోతు ఏముంది? చర్మం మీద అలా గుచ్చేసరికి రక్తం వచ్చేస్తుంది. మన చర్మం ఎంత పలచగా ఉంటుందో, కొంతమంది మనుషుల ప్రేమలు అలాగే ఉంటాయి. అంటించుకొన్నట్టు ఉంటాయి, లోపల ఏమీ ఉండదు. కొంతమంది మనుషుల ప్రేమ ఎంత లోతు ఉంటుందంటే, ఈ చర్మానికి ఎంత లోతు ఉందో ఆ ప్రేమకీ అంతే లోతు ఉంటుంది.

ద్వారకానాథ్ దేశ్‌ముఖ్ ఒక మాట చెప్పాడు. మీరు ఎవరికైనా ఉపకారం చేసి ఉంటే, కనీసం వాళ్ళ మనస్సులో జ్ఞాపకం ఉంచుకోవాలని కూడా మీరు అనుకోవద్దు అన్నాడు. మీరు జీవితంలో ఎవరికైనా ఉపకారం చేసి ఉంటే, మీరు ఎవళ్ళకైతే ఉపకారం చేసారో వాళ్ళు తిరిగి ఉపకారం చెయ్యాలని మీరు అనుకోవద్దు, చేస్తే చేస్తారు లేకపోతే లేదు, అనుకోవద్దు అసలు. కనీసం వాళ్ళ మనస్సులో జ్ఞాపకం ఉంచుకోవాలని కూడా మీరు అనుకోవద్దు అన్నాడు. వాళ్ళు జ్ఞాపకం ఉంచుకోవటం ఏమిటి? వాళ్ళ గొడవ ఎందుకండీ మీకు? ఈ జఢవస్తువుల గొడవ! నీడల గొడవ ఎందుకండీ? దీపాన్ని వదిలేసి నీడని పట్టుకోవటం ఏంటి? మీకు ఇచ్చేవాడు ఈశ్వరుడు ఉండగా వాడు జ్ఞాపకం ఉంచుకోవాలి. వాళ్ళు నిజంగా జ్ఞాపకం ఉంచుకున్నా, వాళ్ళు మీకేమి చెయ్యగలరు ఈశ్వరుడు చెయ్యాలి కానీ, మీకేది చేసినా! ఎందుకొచ్చిన గొడవ ఇదంతా! ఒకవేళ నిజంగా జ్ఞాపకం ఉంచుకుంటే మట్టుకు మీకేం చెయ్యగలరు? మీకు చెయ్యగలిగింది ఈశ్వరుడు చెయ్యాలి కానీ. వాళ్ళు జఢ వస్తువులు.

ఒకసారి భగవాన్ నడిచి వెళ్తూ ఉంటే ఆయన కాలులో ముల్లు విరిగింది. కూడా ఉన్న అతను స్వామీ మీ కాలిలో ముల్లు విరిగింది, ఆ ముల్లు తీసేస్తాను ఆగండి అన్నాడట. ఏ ముల్లు తీస్తావు, కొత్త ముల్లు తీస్తావా? పాత ముల్లు తీస్తావా? అన్నారట భగవాన్. నువ్వు ముల్లు తీసేస్తాను అంటున్నావు, కొత్త ముల్లా? పాత ముల్లా? అని కాలు చూపించారు. ఆ కాళ్ళ నిండా ముల్లులేనట. అంటే ఆయన శరీరానికీ ఆయనకీ ఎంత దూరమో, ఆ విషయం చెప్పటం కోసం మీకు ఈ సంగతి నేను చెపుతున్నాను.

చాలా మంది అనుకుంటారట వాడు భక్తుడేమో గడ్డం పెంచాడు అని, కాదు అది అబద్ధం. సర్వసాధారణంగా గడ్డాలు ఉన్న వాళ్ళందరినీ భక్తులేమో అనుకుంటారు. ఒకసారి వివేకానంద మాట్లాడుతూ ఉంటే గడ్డాలు ఉన్న వాళ్ళు అందరూ ముందు కూర్చున్నారట. మీకందరికీ గడ్డాలు వచ్చిన మాట నిజమే కానీ ఆధ్యాత్మికంగా మీరందరూ కూడా చిన్న పిల్లలు, గడ్డాలు వచ్చిన పిల్లలు! గడ్డాలు వచ్చాయి కానీ మీరందరూ పిల్లలే. అంత బండతనంగా మనం అనలేము! ఏమనుకుంటారో అని అనిపిస్తుంది. అమెరికాలో ఒకతను భారతం చదివాడు. వాడికి చెడ్డ చూడటం అలవాటు మంచి చూసే అలవాటు లేదు. భారతం అంతా చదివి వాడు ఒక పాయింట్ కనుక్కున్నాడట. కుంతీదేవికి పెళ్ళి అవ్వకుండా కర్ణుడు పుట్టాడు అని. ఒక పెద్ద సభలో వివేకానందని కుంతీ దేవికి పెళ్ళి అవ్వకుండా కర్ణుడు ఎలా పుట్టాడు అని అడిగాడట. మీ భారతదేశంలో పెళ్ళి అవ్వకుండానే పిల్లలు

పుడుతూ ఉంటారు అనుకుంటాను అన్నాడట. భారతంలో ఇంకేమీ మంచి కనపడలేదా వాడికి! అప్పుడు వివేకానంద అన్నాడట, మా అమ్మకి కూడా పెళ్ళి అవ్వలేదు, మా అమ్మకి కూడా పెళ్ళి అవ్వకుండా నన్ను కన్నది. నన్ను కని కలకత్తాలో సముద్రంలో పడేసింది. ఇక్కడ అమెరికాలో సముద్రంలో తేలాను నీలాంటి వాళ్ళకి బుద్ధి చెప్పటానికి! అమెరికాలో ఉండగా కోటు వేసుకునేవాడట వివేకానంద. ఈ సన్యాసికి కోటు ఏంటని ఒక దొర, ఈయన నిద్రపోతుంటే రైలులోంచి కోటును బయట పడేసాడు. తరువాత ఈయన లేచాడు, మనం అయితే నేచురల్‌గా నా కోటు పోయింది ఎవరు తీసారు అని అడుగుతాము. ఈయన లేచి అటూ ఇటూ చూసాడు. కంపార్ట్‌మెంట్‌లో వాళ్ళిద్దరే ఉన్నారు, వీడే పడేసి ఉంటాడు కోటు అని ఊహించాడు. నెమ్మదిగా వాడి బూట్లు తీసి బయట పడేసాడు. ఈయనకి మెలకువ వచ్చేసరికి ఆయన నిద్రపోతున్నాడు. ఈయన బూట్లు పడేసిన ఇంకో గంటకి ఆయనకి మెలకువ వచ్చింది. అప్పుడు నిజమైన నిద్రో, దొంగ నిద్రో, ఈయన నిద్రపోతున్నాడు. అతను లేపి ఏమయ్యా నా బూట్లు ఏమైనాయి అన్నాడు? నా కోటు ఎక్కడ ఉందో వెదికి తేవటానికి నీ బూట్లు వెళ్ళిపోయాయి నా కోటు కనిపిస్తే కానీ నీ బూట్లు కనపడవు అన్నాడు.

వివేకానందకి గురువు మీద అనుమానం వచ్చింది, ఏంటి ఈయనకి ఇంత జబ్బు చేసింది, ఈయన నిజంగా జ్ఞాన గురువేనా అని. నిజంగా ఈయనకి ఔన్నత్యం, గొప్ప స్థితి ఉందా? జ్ఞానం పొందాడా లేదా అని గురువు మీద సందేహం వచ్చేసింది. అప్పుడు రామకృష్ణుడు అంటాడు, ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో, వాడే రామకృష్ణుడు. ఏమీ యుద్ధాలు చెయ్యకుండా, ఉపన్యాసాలు చెప్పకుండానే కోట్లాదిమంది హృదయాలలో సజీవంగా ఉన్నాడు రామకృష్ణుడు. ఆయుధాలు చేత్తో పుచ్చుకున్నారు వాళ్ళు. ఈయనకి ఆయుధాలు అక్కరలేకుండానే కోట్లాదిమంది హృదయాలను జయించాడు, ఆయన ప్రేమతో జయించి కోట్లాది మంది హృదయాలలో సజీవంగా ఉన్నాడు. రామకృష్ణుడు శరీరం విడిచి పెట్టాక, శారద గాజులు తీయటానికి ప్రయత్నం చేసింది. అప్పుడు శారదకి కనిపిస్తాడు రామకృష్ణుడు. ఎందుకమ్మా నువ్వు గాజులు తీస్తావు, మరణం అంటే ఏమీ లేదు ఒక గదిలోంచి ఇంకో గదిలోకి వెళ్ళటం లాంటిది అన్నాడు.

ఇవి రెండూ జ్ఞాపకం ఉంచుకోండి, ఒకటి కామన్ సెన్స్, రెండు ప్రాక్టికల్ సెన్స్. ఈ రెండు సెన్సులూ పెరగాలంటే మనిషి భగవంతుడి నామం విడిచిపెట్టకూడదు.

హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే; హరేరామ హరేరామ రామరామ హరేహరే!

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | | |
|---|---|---|---|
| జూలై | 16 | గురుపూర్ణిమ | ఉదయం గం॥ 6-00లకు పారాయణ |
| | | | గం॥ 7-00లకు అల్పాహారం |
| | | | గం॥ 8-00లకు పూజా కార్యక్రమం |
| | | | గం॥ 9-00లకు భక్తుల ప్రవచనములు |
| | | | గం॥ 11-00లకు అన్న ప్రసాదం |
| | | మధ్యాహ్నం | గం॥ 1-00లకు భక్తుల ప్రవచనములు |

SRI RAMANA KSHETRAM A/c. No. **510101006497273**
**Corporation Bank, Palakol Branch,** IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

# వ్యాసం వందే జగద్గురుం

జగద్గురువు వేదవ్యాసుని జన్మదినమైన ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా, ఆధ్యాత్మిక పర్వదినంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. గురువును సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా, అట్లే త్రిమూర్తి స్వరూపంగా ఆరాధించడం, గురుపూర్ణిమరోజున వ్యాసుని స్మరించుకొని తమ గురువును పూజించడం, ఆచారంగా వస్తోంది. గురుభక్తులందరికీ గురుపూర్ణిమ గొప్ప పండుగ. అవతారపురుషులందరికీ గురువు ఉన్నారు. వ్యాసుడి అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. వేదరాశిని నాలుగుగా విభజించి, వేదవ్యాసుడయ్యాడు. బ్రహ్మసూత్రాలు, అష్టాదశ పురాణాలు, మహాభారతము, భాగవతాన్ని, రచించి మానవాళికి మార్గదర్శి అయ్యాడు. మన సనాతన సంప్రదాయంలో గురు, శిష్య పరంపర కొనసాగుతూనే ఉంది. ఆధ్యాత్మిక జీవితం అనే కట్టడానికి, అట్లే జీవుడు తనలోని దివ్యత్వాన్ని 'తాను'గా అనుభవైకవేద్యం చేసుకొనుటకు, గుర్వనుగ్రహమే పునాది. జ్ఞాన సాగరంలో పయనించే శిష్యులకు గురువు నావవంటి వాడని ఆదిశంకరులు పేర్కొన్నారు. వ్యాసుడు అంటే విశ్వవ్యాపకచైతన్యం, గురు స్వరూపం, అందువల్లే వ్యాసాయ విష్ణురూపాయ అన్నారు. మనము గురువుపట్ల కృతజ్ఞత చూపడానికే గురుపూర్ణిమ ఏర్పడింది. బాహ్యముగా ఉన్న చీకటిని సూర్యుడు పోగొడతాడు, లోపల ఉన్న అజ్ఞానమనే చీకటిని పోగొట్టేవాడే గురువు. జీవుడు వాస్తవముగా తాను ఎవరో తెలుసుకొనుటకు మనస్సుకు అంతరదృష్టిని కలిగించి, స్వరూప అమృతస్థితిలోకి మేలుకొలిపే అనుగ్రహ స్వరూపుడే గురువు. ఆత్మ జ్ఞానియైన గురువు లభించడం అనేక జన్మల పుణ్యఫలం, అట్టి గురువు యొక్క ప్రభావం మానవాళిపై అత్యంత బలీయముగా ఉంటుంది. గురువు నిర్దేశించిన మార్గములో పయనించి, దేహము జీవించియుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొంది స్వరూప అమృత స్థితిని 'తాను'గా అనుభవైకవేద్యం చేసుకోవడమే మన జీవిత గమ్యం.

ఓం తత్‌సత్

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురువు ఉపదేశాన్ని శిరసావహించటంతో పరమాత్మలో లీలమవుతాడు

ఎవరైతే గురువును భక్తితో, శ్రద్ధతో, ఓర్పు ఆప్యాయత, ఆత్మీయత, గౌరవం, నమ్మకము కలిగి సేవిస్తారో వారు గురువు ఆశీస్సులను ఆప్యాయతను పొందుతారు. గురుశాసనమే వేదాక్షరాలుగా పాటించాలి. నిర్వాణ సాక్షాత్కార మార్గం చెప్పటం కష్టం. ఒక పురుషుడు తనకున్నటువంటి సహజబలంతో హిమాలయ శిఖరాలకు చేరగలడు. ఆ గిరిని ఇక్కడికి తీసుకొని రాలేడు. అందుకే నిర్వాణం, కంటితో ముక్కుతో, కాయంతో తెలియదగినది కాదు. విశుద్ధ మనస్సుతో ప్రావీణ్యమైన రుజువుగా ఉన్న అనావరణమైన మనస్సుతో, నిరావిషయమైన మనస్సుతో సమ్యక్ ప్రతిపత్తిగలవాడు దర్శించగలడు. గురువు మన నటనను, మనం చెప్పే అబద్ధాలను గ్రహించలేదని భ్రమించటం మన అజ్ఞానం. గురువును మోసం చెయ్యటం సులభమే. కాని ఒక గురువుకు ద్రోహం చేసి మరో గురువును సంపాదించటం ఏడు జన్మలు వేదనతో నిరీక్షించినా దొరకడు. గురువును అలక్ష్యం చేసేవాడు చులకన తీర్పులు చేసేవాడు జన్మంతా కృసించిపోతూ ఉంటాడు. మనలను చూడగానే ఓహో, ఆహా అని మన వెంటపడవలసిన అవసరం గురువుకు ఏమిటి? మన ధనం మీద ఆయనకు ఆశ ఉంటుందా? మనలాంటివాళ్ళు వేలాదిమంది వస్తారు, పోతారు. నమస్కారం చేసే ప్రతీవాడిని శిష్యునిగా భావించాలా? ఒక గురువు అన్వేషించేముందు ఎవరికివారు అన్వేషించుకోవాలి. పెద్ద ఆపరేషన్ ముందు పూర్తి శారీరక పరీక్షలు అవసరం. అప్పుడు గాని బల్ల ఎక్కించరు. మొదట గురువు పరీక్షలు పెడతాడు. వీడు మన శరీరం వదిలినప్పుడు పక్కచూపులు చూసి ఇంతకాలం చేసిన శ్రమను మర్చిపోయి గోడ దూకుతాడా! అని అన్నీ సవ్యంగా ఉంటే నిన్ను శిష్యునిగా స్వీకరిస్తాడు. కొందరి స్థితి రిపేరుకు అందనంతగా ఉంటే అలాంటి వారిని దగ్గరకు రానియ్యడు. మానసిక జాడ్యం ముదిరిన ఏ వ్యక్తిని గురువు అంగీకరించడు. ధైర్యం కావాలి. శ్రీనాన్నగారు "గురువు చేసే కృషి రాత్రి పగలు అనే తేడా ఉండదు అది మీ బుద్ధికి అందదు. మీ ఇంద్రియాలకు అందదు. నాన్నగారు శరీరం వదిలినా మీపై అలుపెరుగని కరుణ, ప్రేమ నిరంతరం వస్తుంది. అది నిజ భక్తుడు గ్రహిస్తాడు అంటూ గురువు అయిపోవాలని ఎవరూ ఆత్రుత పెట్టుకోకండి. అది ముళ్ళ కిరీటం" అన్నారు. ముళ్ళకిరీటం అంటే మన దురాలోచనలు, ఆశలు పగలు వాసనలు కట్టలు తెంచుకొని మన శిరస్సులో నాట్యం చేస్తూ ఉంటే అసహ్యించుకోడు. వాసనల వల్ల అలా వ్యవహరిస్తాడు అని మురికిని కడిగి ముద్దుపెట్టుకుంటాడు. ఈ భావన కూడా ఆయన మాటలే. మనకు ముఖ్యమైనది గురువుపై పూర్ణ విశ్వాసం కావాలి. నీటికోసం బావి తవ్వాలంటే నీరు పడేవరకూ వదలకూడదు. అక్కడ గొయ్యి తవ్వి, ఇక్కడ ఒక గొయ్యి తవ్వి నీరు రాలేదని నిరాశపడకూడదు. ఎన్ని జన్మలకైనా నీ ప్రేమే కావాలి అని ఆయన ఛాయాచిత్రంలోని పండువెన్నెల వంటి కళ్ళు చూస్తూ ఉంటే వారిలో లీనమౌతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966